

నేడు, రేపు జిల్లాలో కేంద్ర మంత్రి పర్యటన

భీమవరం : కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి భారతి ప్రవీణ్ పవార్ ఈ నెల 21, 22 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచార శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం భీమవరంలో, గురువారం పాలకొల్లులో పర్యటించినట్లు పేర్కొన్నారు. 21న భీమవరం విష్ణు కళాశాల ఆడిటోరియంలో ఉదయం 6 గంటలకు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. 9 :15 నిమిషాలకు విష్ణు కళాశాల ప్రాంగణంలో ఉన్న దేవాలయాన్ని సందర్శించి 9:45 నిమిషాలకు రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తారని తెలిపారు. 10:30 గంటలకు భీమవరం హాస్పిటల్స్‌లో మేధావులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారని, మధ్యాహ్నం 3:15 నిమిషాలకు విష్ణు డెంటల్ కళాశాలలో ఏర్పాటు చేసిన యువ ఓటర్లతో ముఖాముఖిలో పాల్గొనున్నారు. 22వ తేదీ ఉదయం 9:30 నిమిషాలకు భీమవరం విష్ణు కళాశాలలో పాత్రికేయుల సమావేశంలో పాల్గొనున్నారని తెలిపారు. 11 గంటలకు పాలకొల్లు టిడ్కో గృహాలను పరిశీలించి మధ్యాహ్నం 3:30 నిమిషాలకు పాలకొల్లు బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

తిలకం దిద్ది, హారతులిస్తూ..

సిపిఎం మహాపాదయాత్రకు ఘన స్వాగతాలు

ప్రజాశక్తి-ఎటపాక, చింతూరు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో మంగళవారం ప్రారంభమైన పోరుకేక మహాపాదయాత్రకు నిర్వాసిత గ్రామాల్లో ప్రజలు తిలకం దిద్దు, హారలిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ పాదయాత్రను ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో మంగళవారం అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. నిర్వాసితులు పూలమాలను వేసి పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. కళాకారులకు, కార్యకర్తలకు, నిర్వాసితులకు అల్పాహారం, తాగునీరు కల్పించారు. పాదయాత్రకు అగ్రభాగాన కళాకారులు ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ డోలు కొమ్ము రేల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెల్లిపాకలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిపిఎం శ్రేణులు, నిర్వాసితులు ట్రాక్టర్లలోనూ, మ్యాజిక్ ఆటోల్లోనూ, మోటార్ బైకులపైనా వందలాదిగా తరలివచ్చారు. ఎర్రని ఎండను సైతం లెక్కచేయకుండా ఎర్రజెండాలతో పాదయాత్రలో పాల్గొన్నారు. దీంతో నెల్లిపాక ప్రధాన కూడలి ఎరుపెక్కింది. బహిరంగ సభ అనంతరం ప్రారంభమైన పాదయాత్ర తోటపల్లి చేరుకుంది. అక్కడ మధ్యాహ్నం భోజనం అనంతరం ప్రారంభమైన పాదయాత్ర గన్నవరం, గౌరీదేవిపేట, నందిగామ మీదుగా మురుమూరు వరకు సాగింది. గన్నవరం గ్రామంలో సిపిఐ నాయకులు పాదయాత్ర బృందానికి పూలమాలవేసి స్వాగతం పలికారు. అనంతరం పోలవరం ఉద్యమకారుడు, రైతు సంఘం నాయకుడు కందుల శ్రీనివాస్ స్తూపనికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ పాదయాత్రలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, ఏపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా నాయకులు బలరాం, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు కుంజా రాధ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, మోడం నాగయ్య. విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి. కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్న, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, కూనవరం నాయకులు మేకల నాగేశ్వరరావు, చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ పంచాయతీ తీర్మానం అందజేత

సిపిఎం మహా పాదయాత్ర బృంద నాయకుడైన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు ఎటపాక మండలం నందిగామ పంచాయతీ గ్రామ సభ తీర్మానాన్ని అందజేశారు. 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకొని నందిగామ పంచాయతీలోని నందిగామ, నందిగామపాడు గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చి పునరావాసం కల్పించాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ మేరకు గతంలో రూ.1.15లక్షలు పరిహారం ఇచ్చిన భూములకు రూ.5లక్షలు చెల్లించాలని, రాబోయే గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలుగా నిత్యవసర సరుకులు, టార్పాలిన్లు, కిరోసిన్/సోలార్ లాంతర్ తదితరాలు సిద్ధం చేసి ఉంచాలని పంచాయతీ చేసిన గ్రామసభ తీర్మానాన్ని గ్రామ ప్రజలు శ్రీనివాసరావుకి అందించారు.



పాదయాత్ర బృందానికి తిలకం దిద్ది హారతులిస్తున్న మహిళలు

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయండి : విఎస్ఆర్

ఎటపాక : పాదయాత్ర సందర్భంగా నందిగామలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది జూలైలో వరదల కారణంగా నందిగామ గ్రామం పూర్తిగా మునిగినా నష్ట పరిహారం చెల్లించలేదని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యంపై 3గంటల పాటు రాస్తారోకో చేసారని, అందులో తను కూడా పాల్గొన్నానని గుర్తు చేశారు. కానీ నేటికీ ఈ గ్రామానికి వరద నష్ట పరిహారం చెల్లించలేదని, 41.15 కాంటూరులో చేర్చలేదని పేర్కొన్నారు. మాట తప్పం.. మడమ తిప్పం అనే జగన్ గతంలో రైతులకు రూ.1.15లక్షలు ఇచ్చిన రైతులకు రూ.5లక్షల ఇస్తామని వాగ్దానం చేసిన హామీ ఏమైందని ప్రశ్నించారు. 4సంవత్సరాలు గడిచినా ఇచ్చిన మాట నెరవేర్చక పోవడం మడమ తిప్పడం కాదా అని ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులు పరిహారం పునరావాసం అడుగుతుంటే వినిపించడం లేదా అన్నారు. తాడేపల్లి పాలస్‌లో పడుకున్నావా అంటూ మండిపడ్డారు. పోలవరం నిర్వసితులందరికీ ఒకే సారి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న వి.శ్రీనివాసరావు



వర్షంలోనూ సాగుతున్న పాదయాత్ర



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్

పాదయాత్రకు వందలాదిగా కదిలిన జనం

విఆర్.పురం : పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన ఎటపాక మండలం నెల్లిపాకలో మంగళవారం ప్రారంభమైన మహాపాదయాత్రకు విఆర్.పురం మండలం నుండి నిర్వాసితులు, సిపిఎం శ్రేణులు భారీగా తరలివెళ్లారు. రేఖపల్లిలో ఎంపిపి కారం లక్ష్మి, మాజీ ఎంపిపి సున్నం నాగమ్మ, మాజీ ఎమ్మెల్యే సతీమణి సున్నం చుక్కమ్మ ఎర్ర జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ నుండి వాహనాల్లో వందలాది మంది నెల్లిపాక బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఏపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పంప సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, పూనం ప్రదీప్ కుమార్, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులు కారం సుందరయ్య, సోడి మల్లయ్య, పోడియం శ్రీరామ్మూర్తి, ప్రకాష్, సత్యనారాయణ, సుధీర్, హజరత్, కన్నయ్య, వీర్ల నాగేశ్వరరావు నాయకత్వం వహించారు.

ముంపు బాధితులకు జరగని న్యాయం

కూనవరం : పోలవరం ప్రాజెక్ట్ ముంపు వల్ల నష్టపోతున్న ప్రజలకు సరైన న్యాయం జరగడం లేదు. ప్రతిఏటా ముంపు ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వచ్చే వరదలకు కూనవరం, ఎటపాక, విఆర్.పురం, చింతూరు 4 మండలాల్లో అనేక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. కట్టు బట్టలతో రోడ్డున పడుతున్నారు. అన్ని గృహోపకరణ వస్తువులను గోదారమ్మకు వదిలేసి బతుకు జీవుడా అని ఎత్తయిన ప్రాంతాలలో తల దాచుకుంటున్న పరిస్థితి. అటు వరద వచ్చి ఇబ్బంది పడ్డ ప్రజలు వరద తగ్గాక కూడా ఇళ్లలో బురద పేరుకు పోయి ఒక్క ఇంటిని శుభ్రం చేయడానికి రూ.20వేలు నుండి రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు పంటలు ఆలస్యంగా వేయాల్సి వస్తోంది. ముంపు మండలాలలో అత్యధికంగా వేసే మిర్చి, పొగాకు లాంటి వాణిజ్య పంటలు వరదల వల్ల 3 నెలలు ఆలస్యంగా వేయాల్సి వస్తోంది. దీంతో దిగుబడి రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. గతేడాది వరదలు సమయంలో ముఖ్యమంత్రి ఇస్తానన్న రూ.10వేలు ఆర్థిక సాయం కూడా నేటికీ అందని పరిస్థితి ఉంది. మరో వైపు కాంటూరు 41 అడుగుల లెక్కలు చెబుతూ పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా ప్రభుత్వాలు కాలం వెళ్లదీస్తున్నాయి. గతేడాది వచ్చిన వరదలకు మొత్తం మునిగిపోవడంతో కాంటూరు లెక్కలు పెద్ద బూటకమని ప్రకృతి సైతం తేల్చింది. అటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడం లేదు. నష్టపరిహారం ఇవ్వడం లేదు. పునరావాసం కల్పించడం లేదు. ముంపు మండలాలు రోజులు తరబడి నీటిలో మునిగితే చూసే నాథుడే కరువైయ్యారు. కనీసం నిత్యావసరాలు కూడా సరిగా ఇవ్వలేదన్నది సగటు ముంపు బాధితుల ఆవేదన. ఈ విధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా ముంపు ప్రజలకు అన్యాయం జరుగుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిని గాలికొదిలేశాయి.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న నాయకులు, పేదలు

మోకాళ్లపై పెరుగులంక పేదల నిరసన

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ పెరుగులంక భూముల కోసం సిపిఎం చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారానికి 15వ రోజుకు చేరాయి ఈ దీక్షలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మట్టి అక్రమ తవ్వకాలను నిరసిస్తూ.. మోకాళ్లపై నిలబడి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షత వహించారు. ఈ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పేదలకు న్యాయం చేయాల్సిన అధికారులు పెద్దల అడుగులకు మడుగులొత్తుతూ హైకోర్టు స్టేను సైతం పక్కనపెట్టి పెరుగులంక భూముల్లోని మట్టిని యథేచ్ఛగా బయటకు తరలిస్తూ పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. నరసాపురం నియోజకవర్గంలో అనేకచోట్ల మట్టి పెద్దఎత్తున లభ్యమవుతున్నప్పటికీ కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగా చించినాడ పేదప్రజలకు లంక భూములు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ కుట్రలను అధికార యంత్రాంగం వైసిపి కార్యకర్తల్లా పనిచేస్తూ అమలు చేయడం సిగ్గు చేటని, రానున్న రోజుల్లో ఈ కుట్రలో భాగస్వామ్యమైన వారందరికీ గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పేదలకు న్యాయం జరిగే వరకూ చించినాడ పోరాటానికి వ్యవసాయ కార్మిక సంఘం పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ దీక్షలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, నాయకులు బళ్ల చినవీరభద్రం, కండెల్లి సోమరాజు, షేక్ పాదుషా, గుబ్బల నాగేశ్వరరావు, జక్కంశెట్టి వెంకటలక్ష్మి, శేషపు ఆశ్రియ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు : జెసి

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న జెసి

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ముందస్తు ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో 2022-23 సీజన్ ఖరీఫ్, రబి ధాన్యం కొనుగోలులో ఎదురైన సమస్యలు, ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో జెసి సమీక్షించారు. ప్రతీమంగళవారం ధాన్యం కొనుగోలు తీరును, సమస్యలు, తీసుకున్న పరిష్కారచర్యలపై సమీక్షిస్తామన్నారు. ప్రతిరైస్ మిల్లులో సీసీ కెమెరాలు, డ్రయర్ యంత్రాలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా బరకాలు, గోనెసంచులు, సంబంధిత పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యానికి సంబంధించి హమాలీలు, రవాణా వాహనాలు, ఛార్జీల చెల్లింపులు వంటి వాటిని సమీక్షించు కోవాలన్నారు. రైతు భరోసా కేంద్రంలో సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేయాలన్నారు. అకాల వర్షాల వల్ల ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సమిష్టి కృషితో ధాన్యం కొనుగోలులో మంచి ఫలితాలు సాధించామని, ఇదే స్ఫూర్తితో రాబోయే పంటల ధాన్యం కొనుగోలుకు సంసిద్ధులుగా ఉండి, రైతులకు మంచి సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లయీస్ డిఎం టి.శివరామ ప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, డిసిఒ ఎం.రవికుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు, ఎఫ్‌సిఐ అసిస్టెంటు మేనేజరు రంజిత్ కుమార్, ఎఎస్ఒ రవిశంకర్ పాల్గొన్నారు.



పెనుమంట్రలో పడుతున్న వర్షం

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - పెనుమంట్ర

నిర్మాణానికి నిధులిచ్చి, బిల్లులు మంజూరు చేస్తున్నా పనులు నత్తనడకన సాగడానికి కారణాలేంటని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారుల పనితీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పెనుమంట్ర హైస్కూల్‌లో నాడు - నేడు పనులు, పెనుమంట్ర కోడ్ నంబర్-8 అంగన్‌వాడీ భవన నిర్మాణ, ఆలమూరు శివారు కోమటిచెరువులో నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పెనుమంట్ర హైస్కూల్లో విద్యార్థుల మురుగుదోడ్ల నిర్మాణం ఆలస్యం కావడానికి కారణం అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల విషయంలో ఎందుకు అశ్రద్ధ చేస్తున్నారని పంచాయతీరాజ్ ఎఇ సత్తి నాగిరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆలమూరు శివారు కోమటి చెరువులో గట్టి ఏరియాలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం పునాధి పనులు వెంటనే చేసి ఫొటోలు తమకు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దండు అశోక్ వర్మ, పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర మండల ప్రాథమిక పాఠాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. కోడి గుడ్డు సైజ్‌ను స్వయంగా పరిశీలించి నిర్ణీత బరువు ఉన్నది లేనిది తూకం వేయించారు. పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

ఇన్నాళ్లకు గుర్తొచ్చానా.. వాన..

జిల్లాలో పలుచోట్ల మంగళవారం తొలకరి వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించిన సుమారు వారం రోజుల తర్వాత వర్షాలు పడటంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఇప్పటి వరకూ ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరైన జనం వర్షం పడడంతో ఉపశమనం పొందారు.

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్షం పడింది. ముఖ్యంగా మార్టేరు, ఆలమూరు, భట్లమగుటూరు,

జిల్లాలో పలు చోట్ల వర్షాలు

ఓడూరు, నెలమూరు, వెలగలేరు, బ్రాహ్మణచెరువు గ్రామాల్లో విస్తారంగా వర్షాలు పడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఉపసమనం పొందారు. దూర ప్రాంతానికి వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

పాలకొల్లు : పాలకొల్లులో మంగళవారం ఉదయం తేలికపాటి వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. సోమవారం కూడా వాతావరణం చల్లగా ఉండడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత పక్షం రోజులుగా తీవ్ర ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు మారిన వాతావరణం ఆహ్లాదంగా మారింది. మధ్యాహ్నం ఎండగా ఉన్నా సాయంత్రం ఈదురుగాలులతో వాతావరణం చల్లబడింది.



అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పురపాలక సంఘం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫిల్టరింగ్, క్లోరినేషన్, ప్యూరిఫికేషన్ విషయంలో అలసత్వం వహించకూడదన్నారు. నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ జరగాలన్నారు. ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణ పనులు వేగంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వైస్ ఛైర్ పర్సన్ కామన నాగిని, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిఇ, ఎఇలు పాల్గొన్నారు.

కాకతీయ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం శ్రీ కాకతీయ పాఠశాలలో పుస్తకాలు అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ కాకతీయ విద్యాసంస్థల్లో పుస్తకాల పేరుతో విద్యార్థుల నుంచి వేల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. ఎల్‌కెజి పిల్లవాడికి రూ.5000, ఏడో తరగతికి రూ.8000, పదో తరగతి పిల్లలకు అంతకన్నా ఎక్కువ వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం ప్రయివేట్ పాఠశాలలో పుస్తకాల అమ్మరాదని, టెక్ట్స్‌బుక్స్‌కు నామమాత్రం రుసుము ఉందని, వీటిని యాజమాన్యం లెక్క చేయడం లేదని విమర్శించారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నా కనీసం పిల్లలు ఆడుకోవడానికి ఆటస్థలం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కాకతీయ విద్యాసంస్థ మాత్రమే కాదు పట్టణ వ్యాప్తంగా పాఠశాలలో ఈ విధంగా విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రతి పాఠశాలలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి పాఠశాలకు వచ్చి పుస్తకాలను తనిఖీ చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బి.గణేష్, పి.మోహిని, బి.శాంతి, ఎం.శివ, టి.చిరంజీవి పాల్గొన్నారు.



కాకతీయ పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్న దృశ్యం


వికలాంగుల పింఛను పెంచాలని ధర్నా

ప్రజాశక్తి - పాలకొల్లు

వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వికలాంగులు తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్ పెద్దిరాజుకు వినతిపత్రం అందజేశారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు అణుగుణంగా ప్రస్తుతం రూ. 3000 ఇస్తున్న పెన్షన్‌ను రూ.6000లకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి డేవిడ్ రాజు పాల్గొన్నారు.

26 నుంచి పకడ్బందీగా ఓపెన్ స్కూల్ పరీక్షలు : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఒ కృష్ణవేణి

జిల్లాలో ఈనెల 26వ తేదీ నుండి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ పదో తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో పదో తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులతో కృష్ణవేణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షలను ఉదయం తొమ్మిది గంటల నుండి 12 గంటల వరకూ నిర్వహిస్తామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు 1875 మంది మూడు కేంద్రాల్లో, ఇంటర్ విద్యార్థులు 2968 మంది ఐదు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. భీమవరంలో ఎస్‌సిహెచ్‌బిఆర్ఎంహెచ్ఎస్ పాఠశాలలో 670 మంది, జెఎల్‌బి ఎంపిఎల్ ఉన్నత పాఠశాలలో 630 మంది, ఎంపిఎల్ ఉన్నత పాఠశాల చిన్నరంగనిపాలెంలో 575 మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. ఆకివీడులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 669 మంది, సెయింట్ అలోయసీస్ ఉన్నత పాఠశాలలో 586 మంది, భీమవరంలో ఎఆర్‌కెఆర్ఎంపిఎల్ ఉన్నత పాఠశాలలో 806 మంది, పాలకొల్లులో ఎంఎంకెఎంఎంపిఎల్ ఉన్నత పాఠశాలలో 513 మంది, బిఆర్ఎంవిఎంపిఎల్ ఉన్నత పాఠశాలలో 394 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. పరీక్షా సమయానికి అరగంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. 100 మీటర్ల లోబడి జిరాక్స్ షాపులను పరీక్ష ముగిసే వరకూ మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు, మహిళా అభ్యర్థుల తనిఖీలకు మహిళా పోలీసుల ఏర్పాటుకు పోలీసు అధికారులకు సూచించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పరీక్ష హాల్లోకి అనుమతించడం జరగదని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి కెవి.రమణ, ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ నారాయణ, విద్యుత్ శాఖ అధికారి పి.అహ్మద్ ఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 26 నుంచి వచ్చే నెల 17వ తేదీ వరకూ గణపవరం, పిప్పర పిహెచ్‌సిల పరిధిలోని ఆశాలకు, వాలంటీర్లకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు పి.సంతోషినాయుడు, పి.కరుణ్య, కె.ప్రియాంక సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎవరికైనా శరీరంపై రాగి రంగు మచ్చలు ఉంటే కుష్టుగా అనుమానించి వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం సిహెచ్ ఒ.జలారిదిల్లన్ బాబు, కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాలరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మణికంఠకు 'ఆణిముత్యం'

ప్రజాశక్తి - గణపవరం

విద్యలో రాణిస్తున్న ప్రతి విద్యార్థినీ ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మంగళవారం పిప్పర హైస్కూల్లో పదో తరగతిలో మండల ప్రథమ స్థానంలో నిలిచిన గణపవరం గ్రామానికి చెందిన రేవాటి మెహిత్ బాలమణికంఠకు గోల్డ్ మెడల్‌తోపాటు నగదు బహూకరించారు. కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నైపుణ్యం కలిగి ఉటుందన్నారు. ఈ సందర్భంగా మణికంఠను అభినందించారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.శేషు, తహశీల్దార్ పి.లక్ష్మి, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

201 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం 3వ సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 201 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ పి.సంతోషినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో షుగర్, బిపి, ఉష్ణోగ్రత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ప్రజలు ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం ప్రేమలీల, హెల్త్ అసిస్టెంట్ ఎ.కృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు ఉపయోగకరం

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆణిముత్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆచంట ఎంపిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బొక్క కార్తీక్, గుబ్బల వైష్ణవి, సఖినేటిపల్లి దేవ సంతోష్ కుమార్‌కు సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు గోల్డ్ మెడల్, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, విద్యా కమిటీ ఛైర్మన్ పుచ్చకాయల జ్యోతి, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మన్లు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ఆయుధం..యోగ : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యోగా ఆరోగ్యానికి ఆయుధమని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎస్‌సిహెచ్ బివిఎం హైస్కూల్ విద్యార్థులతో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా ఒక భాగంగా ముందుకు సాగాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, పిఇటిలు జిపిన్ శేఖర్‌రాజు, పి.రామబద్రిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పివిఎల్ నరసింహరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఇఒ కనకరాజు

పివిఎల్‌ను కలిసిన ఎంఇఒ కనకరాజు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని రెండో మండల విద్యాశాఖాధికారి గాదిరాజు కనకరాజు అన్నారు. ప్రభుత్వం మండల విద్యాశాఖకు రెండో ఎంఇఒను నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం పెద అమిరంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజును ఎంఇఒ కనకరాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలోని కోపల్లె ఉన్నత పాఠశాలలో ఫస్ట్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న గాదిరాజు కనకరాజు ఉద్యోగోన్నతిపై చెరుకుమిల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా వెళ్లారు. ఇటీవల బదిలీపై కాళ్ల ఎంఇఒ-2గా మండల విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టి పివిఎల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆచంట ఎంఇఒగా రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండల విద్యాశాఖాధికారిగా పి.రాజేంద్రప్రసాద్ ఉద్యోగ బాధ్యతలు మంగళవారం చేపట్టారు. ఆయన ఐ.భీమవరంలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి ప్రమోషన్‌పై ఆచంట ఎంఇఒగా చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును పోడూరు మండలం తూర్పుపాలెం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వక కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బిసి సేన జిల్లా అధ్యక్షునిగా ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బిసి సేన జిల్లా అధ్యక్షుడిగా కుముజు నాగవెంకట ప్రసాద్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు శౌంఠి నాగరాజు మంగళవారం ప్రకటించారు. పట్టణంలో కముజువారిపాలెంలో బిసి సేన ముఖ్య నాయకుల సమావేశంలో నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య 45 ఏళ్ల పోరాట ఫలితంగా తాను భీమవరం నియోజకవర్గానికి వచ్చానని తెలిపారు. జిల్లాలో బిసిలను ఉన్నతమైన స్థానాలకు తీసుకెళ్లేందుకు బిసిలను, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, ఎంఎల్‌ఎలుగా తీర్చిదిద్దుందుకు జిల్లా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్ బిసిలందరూ చైతన్య వంతులు అయ్యేందుకు అన్నివర్గాలనూ కలుపుకుని 139 కులాలతో త్వరలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సిద్ధం కావాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ బిసి సామాజిక వర్గం అభివృద్ధి కృషి చేయాలని కోరుతూ సంఘం తరపున కండువా కప్పి అభినందించారు. రాష్ట్ర మైనార్టి విభాగం అధ్యక్షుడు ఆసిఫ్పెష కో-ఆర్డినేటర్ పి.రంగనాథ్ అధికార ప్రతినిధి బొమ్మనబోయిన రమేష్ నాయకులు ఏలూరి రంగబాబు, కముజు హరిబాబు, షహనాబ్ బేగం, కాళీ పలువురు నాయకులు పాల్గొని మాట్లాడి నూతన అధ్యక్షుడు ప్రసాదు అభినందనలు తెలిపారు.



ప్రసాద్‌కు బిసి జెండా వేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శౌంఠి నాగరాజు

25 ఏళ్ల తర్వాత పద్మావతి చెరువు ప్రక్షాళన

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పద్మావతి తాగునీటి చెరువులో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు మంగళవారం శ్రీకారం చుట్టారు. పద్మావతి తాగునీటి చెరువులో వెంకటేశ్వర స్వామి వెలిసిన సంగతి తెలిసిందే. ఈ చెరువు ప్రక్షాళన పనులు చేపట్టేందుకు పంచాయతీ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు మాట్లాడుతూ 25 ఏళ్ల తర్వాత తాగునీటి చెరువు అభివృద్ధి చేసే అవకాశం వెంకట్రామరాజుకు దక్కిందన్నారు. పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు వేగేశ్న విజయరామరాజు మాట్లాడుతూ కాళ్లకూరు గ్రామ ప్రజలకు మంచి పనులు చేస్తున్న దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత వెంకట్రామరాజు చెరువు అభివృద్ధికి రూ.10 లక్షలు ఖర్చు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే సుమారు రూ.30 లక్షల వరకూ అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. దేవస్థానం ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించే అర్చకులు ఈ రేవుల నుంచి నీటిని నిత్యం తీసుకెళ్తుంటారు. ఈ సందర్భంగా వెంకట్రామరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో సాధు శ్రీను, దేవస్థానం మాజీ ఛైర్మన్ అడ్డాల నాగరాజు, దండు ప్రణవమూర్తి రాజు, వీరమల్లు రామారావు, కట్టా సతీష్, చిటికెన సూర్యనారాయణ పాల్గొన్నారు.



పూడికతీత పనులకు భూమిపూజ చేస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు

భీమవరం అంటే అభిమానం : హీరో శ్రీవిష్ణు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం అంటే ఎంతో అభిమానమని, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అంటే మరింత అభిమానమని, అందుకే తాను ఏ చిత్రం చేసినా మొదటి ప్రమోషన్ ఈ కళాశాల విద్యార్థుల సమక్షంలోనే చేస్తానని సినీ హీరో శ్రీవిష్ణు పేర్కొన్నారు. తాను హీరోగా నటించిన సామజవరగమన చిత్రం ఈ నెల 29న విడుదలవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని చిత్రం యూనిట్ హీరోయిన్ మౌనికతో కలిసి మంగళవారం కళాశాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ తాను నటించిన చారిత్రాత్మక చిత్రం అల్లూరినీ కూడా ఈ ప్రాంత ప్రజలు ఎంతగానో ఆదరించి విజయవంతం చేశారని పేర్కొన్నారు. సామజవరగమన కూడా కుటుంబ కథా చిత్రంగా హృదయానికి హత్తుకునే సన్నివేశాలతో బాగుంటుందని తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. చిత్ర దర్శకుడు ఆర్.ఎ.రాజు మాట్లాడారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ ఈ చిత్రం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న హీరో శ్రీవిష్ణు



ఆచంట వేమవరంలో రోడ్లు నిర్మిస్తున్న సర్పంచి చంటి

జగనన్న కాలనీల్లో సౌకర్యాల ఏర్పాటు

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేస్తోందని ఆచంట వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు ఆచంట వేమవరం జగనన్న కాలనీలో రహదారుల నిర్మాణం వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. అర్హతున్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో సాయం చేస్తున్నారన్నారు. జగనన్న కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీవర్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అందే నాగ బసవన్న, నాయకులు కొవ్వల సురేష్ బాబు, కాపవరపు శివ గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

మట్టిని తరలించేస్తున్నారు : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

చించినాడలో దళితుల తలలు పగలగొట్టి కాజాగొప్పు జగనన్న లేఅవుట్లకు మీరు తెచ్చింది 60 లారీలా అని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. మంగళవారం ఆయన కొంతేరులో జగనన్న లేఅవుట్‌ను ఎంఎల్‌ఎ పరిశీలించి మీడియాతో మాట్లాడారు. రైతుకు అవసరంలేని బయటకు పోతున్న వేలాది ఎకరాలలో లక్షల టన్నుల మెరకమట్టి జగనన్న కాలనీలకు అవసరం లేదా అన్నారు. 15 రోజుల్లో పూడిక చేయాల్సిన కాజాగొప్పు 30 ఎకరాలు, కొమ్ముచిక్కాల 30 ఎకరాలు నాలుగేళ్లయినా ఎందుకు పూడిక చేయలేకపోతున్నారని ప్రశ్నించారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

మౌలిక సౌకర్యాల్లేకే నిర్మాణాలు ఆలస్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్రలో జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడం వల్లే జగనన్న కాలనీల్లో ఆలస్యంగా నిర్మాణాలు జరుగుతున్నాయని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి వివరించారు. మంగళవారం పెనుమంట్రలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతికి స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీల్లో రోడ్లు వేయకపోవడం వల్ల ఇసుక, మెటల్, సిమెంట్ తదితర వెళ్లక కూలీలతో మోయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. తద్వారా ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. వెంటనే సమస్యను పరిశీలిస్తామని కలెక్టర్ చెప్పారని తెలిపారు.

బాధితులకు ఆదరణ టీమ్ చేయూత

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి పంచాయతీ పరిధి తురకవానిమెరకకు చెందిన ముప్పిరి పెద్దిరాజు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో అదే గ్రామానికి చెందిన ఆదరణ టీమ్ ఆధ్వర్యంలో యువకుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన రూ.12 వేల నగదు అందజేశారు. అలాగే గత 8 సంవత్సరాల నుంచి మంచం మీద ఉంటున్న సరిళ్ల బాబూరావుకు రూ.5 వేలు నగదును సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్‌తో పాటు ఆదరణ టీం సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ ఆదరణ టీమ్ ద్వారా గ్రామంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదరణ టీమ్ సభ్యులు బొరుసు రాంబాబు, కెవివి సత్యనారాయణ, కె.నాగరాజు, పోలుమూరి బాలకృష్ణ, పొలుమూరి రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - తణుకు

విద్యుత్ శాఖలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తాడేపల్లిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం తణుకు ఎలక్ట్రికల్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ఫీల్డ్ సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యుత్ కార్మికుడూ విద్యుత్ పనులు చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభంపై పనిచేసేటప్పుడు సెల్‌ఫోన్ వాడకం నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇలు జాన్సన్ సాదిక్, రవి ప్రసాద్, జూనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాసవి, వనిత క్లబ్ సభ్యులు జిల్లా గవర్నర్ కోర్లేపర కృష్ణాజీ ఆధ్వర్యంలో సీమకుర్తి రాజా, ఆలపాటి అచ్యుత లక్ష్మి అధ్యక్షతన మంగళవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్లోయింగ్ స్టార్ కిట్టి సభ్యులు, చార్మి లేడీస్ కిట్టి సభ్యుల పేద మహిళలకు జీవనోపాధి నిమిత్తం రెండు కుట్టు మిషన్లు అందజేశారు. 50 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు, బియ్యం, వృద్ధాప్య పెన్షన్లు అందజేశారు. గ్లోయింగ్ స్టార్ కిట్టి సభ్యులు ఆలపాటి కృష్ణ కుమార్ సహకారంతో సంజీవ నగర్ మున్సిపల్ హైస్కూల్లో పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలను ఏర్పాటుచేశారు. అంగన్‌వాడీ స్కూల్లో స్టీల్ కంచాలు, గ్లాసులు దాతల సహకారంతో రూ.2 వేల విలువైన పౌష్టికాహారం, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాగేంద్రరావు, కార్యదర్శి బ్రహ్మాజీ, వనిత, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం దాతలను సత్కరించారు.

వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్‌గా మాధురి

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పండిత విల్లూరు పశు వైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా డి.మాధురి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు మంచి వైద్య సేవలందించాలని మాధురికి శ్రీ రంగనాథరాజు సూచించారు. మాధురి యలమంచిలి పశువైద్యశాల నుంచి పండితవిల్లూరు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ పండితవిల్లూరులో జున్నూరు వెటర్నరీ డాక్టర్ మహేష్ కుమార్ ఇన్‌ఛార్జిగా పనిచేశారు.



ఎంఎల్‌ఏను కలిసిన వెటర్నరీ డాక్టర్ మాధురి

తహశీల్దార్ సునీల్ కుమార్‌ను కలిసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి మండల తహశీల్దార్‌గా విధుల్లో చేరిన మాతా సునీల్ కుమార్‌ను యుటిఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో యుటిఎఫ్ మండల ఇన్‌ఛార్జి పి.క్రాంతికుమార్, అధ్యక్షులు ఇడివి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.రామ్మూర్తి నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ దండు పద్మావతి, ట్రెజరర్ గుత్తిందీవి శ్రీనివాసు, ఆఫీసు బేరర్లు కుసుమ శరత్‌బాబు, పిండి రామచంద్ర రావు, బూరగడ్డ శైలజ ఉన్నారు.



తహశీల్దార్‌ను కలిసిన యుటిఎఫ్ నేతలు

పవన్‌పై ముద్రగడ వ్యాఖ్యలు దారుణం

మాజీ మంత్రి హరరామ జోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

పవన్‌కళ్యాణ్‌పై విశ్రాంత రాజకీయ నేత ముద్రగడ పద్మనాభం చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు, విమర్శలు దురదృష్టకరమని కాపు సేన వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్య విమర్శించారు. ఆయన పాలకొల్లులో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకూ ముద్రగడ చాలా పెద్ద మనిషి, వివాద రహితుడు, కాపుల సంక్షేమం కోరే వ్యక్తి, కాపులకు రాజ్యాధికారం కోరే ప్రముఖుడు అని అనుకున్నానని తెలిపారు. అయితే ఇవి తప్పు అని ఆయన వ్యాఖ్యలు బట్టి తెలుస్తోందని తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై ఎక్కుపెట్టిన బాణాలతో తూట్లు పొడిచారని తెలిపారు. చిన్న చిన్న మంత్రి పదవులు ఆశించి, ఇతర ప్రలోభాలకు లొంగి అవినీతి చక్రవర్తి సిఎం జగన్‌కు మద్దతుగా కాపు సామాజికవర్గాన్ని తాకట్టు పెట్టాలని చూస్తున్న ఆయనకు ఊడిగం చేస్తున్న కొంతమంది కాపు నాయకులు లైనులో ఈయన కూడ చేరారని చెప్పారు. ఆయన విద్య, ఉద్యోగాలలో కాపులకు రిజర్వేషన్ల -సౌకర్యం కలుగజేయడం కోసం చేసిన ఉద్యమాలు చిత్తశుద్ధితో చేసినవి కావని ఇప్పుడు తెలిసిందని చెప్పారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

మొగల్తూరు: తారక్ నాథ్ 19వ వర్ధంతిని మొగల్తూరులోని స్టేట్ బ్యాంక్ ఆవరణలో ఉద్యోగులు మంగళవారం నిర్వహించారు. హైదరాబాద్ స్టాఫ్ యూనియన్ జనరల్ సెక్రటరీ వై.తారక్ నాథ్ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ బి.శ్యామలరావు, అసిస్టెంట్ మేనేజర్ ఎం.సునీల్, హెడ్ క్యాషియర్ ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు ఉన్నత విద్య : ఎంఎల్‌ఎ చెరుకువాడ

పెనుగొండ: పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సిద్ధాంతం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నారని, వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. గతంలో విద్య అంటే కేరళ వైపు చూసే వారిని ఇప్పుడు ఎపి వైపు చూస్తున్నారని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు పెడుతోందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకుని, ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం ప్రథమ స్థానం పొందిన దేవాని శిరీష, గడ్డం సుహాసినీకి రూ. మూడు వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానం పొందిన పి.అఖిలకు రూ.2000, తృతీయ స్థానం పొందిన యాళ్ల రాధికకు రూ.1000 అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చింతపల్లి గనిరాజు (చంటి), ఎంపిటిసి సభ్యులు చిన్నం ఏడుకొండలు, పెచ్చెట్టి జేమ్స్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరంలో రూ.62 కోట్ల అభివృద్ధి పనులు : ఎంఎల్‌ఎ

భీమవరం రూరల్: భీమవరం పట్టణాన్ని వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగిందని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గత నాలుగేళ్లుగా చూస్తే ఇప్పటివరకూ భీమవరం పట్టణాభివృద్ధికి రూ.62 కోట్ల నిధులను ఖర్చు చేయడం జరిగిందన్నారు. ప్రతి వార్డులోనూ సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు డ్రెయినేజీ నిర్మాణాలు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో మరో రూ.ఏడు కోట్ల 17 లక్షల నిధులతో చేపట్టే పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి ప్రతి వారం కూడా నివేదికలను అందించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఏడో వార్డులోని లెప్రసీ కాలనీలో కూడా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అమృత్ పథకంలో ఇప్పటికే పూర్తయిన రెండు మంచినీటి రిజర్వాయర్లను త్వరలోనే ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న డిఇ, ఎఇ పోస్టులను వెంటనే భర్తీ చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఎంఇ త్రినాథరావు, డిఇలు తోట నారాయణరావు, విజయ్, ఎఇలు పాల్గొన్నారు.

22న రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎపి రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం బ్రాహ్మణ చెరువులోని సాయినాథ్ కళ్యాణ మండపం వద్ద ఈ నెల 22వ తేదీన జరుగుతుందని జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు బి.బలరాం హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా, మండల కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు. మండల కార్యదర్శులు బాధ్యత వహించి అందరూ హాజరయ్యేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు.

అంధత్వ నివారణకు లయన్స్ కృషి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అంధత్వ నివారణకు లయన్స్ క్లబ్ కృషి చేస్తోందని లయన్స్ క్లబ్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు తెలిపారు. మంగళవారం స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్లో డైమండ్స్ లయన్స్ క్లబ్, లియో క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ మాణిక్యాలరావు మాట్లాడుతూ సేవలను విశ్వవ్యాప్తం చేసిన ఏకైక సంస్థ లయనిజం అన్నారు. లయన్స్ క్లబ్ సేవలను నూతన కార్యవర్గం స్ఫూర్తివంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లీడర్ షిప్ కోఆర్డినేటర్ శ్రీరామ్ సురేష్, కొప్పిశెట్టి రమణయ్య, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, పదమ్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

మొగల్తూరులో మెగా అభిమానుల సంబరాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రంలోని మెగా అభిమానులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. రామ్ చరణ్ ఉపాసన దంపతులకు పాప పుట్టిన సందర్భంగా మొగల్తూరు లోని చిరంజీవి మండల యువత ఆధ్వర్యంలో గ్రామంలో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు కోపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షులు దాసరి కృష్ణాజీ, ముక్కుగిరి, మేడిది ప్రభాకర్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి రైతూ వైఎస్ఆర్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జావర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఉండి ఏరియా పశు వైద్యశాల ఆవరణలో వైఎస్ఆర్ పశు బీమాపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ జావర్ హుస్సేన్, ఆకివీడు సహాయ సంచాలకులు డాక్టర్ జనార్దన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారన్నారు. ప్రతి ఒక్క రైతూ బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమ, ఉండి, పాలకోడేరు మండలాల పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు

విద్యార్థులు సురక్షితం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం వెంకటాపురం వద్ద పెనుమంట్ర మండలం నెలమూరు శర్వాణి స్కూల్ బస్సు రాపాక ఛానల్ వంతెనపై మంగళవారం అదుపుతప్పింది. ఈ ఘటన జరిగినప్పుడు బస్‌లో 25 మంది విద్యార్థులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదూ అందలేదని పాలకొల్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఇనుప ఊచలు దిగి మేస్త్రీ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు గ్రామంలో భవన నిర్మాణ పనిచేస్తుండగా పరంజి తెగి పడి ఛాతిలోకి ఇనుప ఊచలు దిగి మేస్త్రి సూర్యనారాయణ(40) మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. అతినికి సహాయకునిగా పనిచేస్తున్న మధు నాగేంద్రకు గాయాల అయ్యాయి. సూర్యనారాయణను హుటాహుటీన పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని రాగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు చెబుతున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు చెబుతున్నారు. మృతునికి భార్య ఉన్నారు. పిల్లలు లేరు.